

సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
19వ వసంతంలోకి ...


కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
పోలవరం(రంపచోడవరం)జిల్లా

శుక్రవారం,27 ఫిబ్రవరి 2026
8 పేజీలు


# కోరమండల్ 'సీఎస్ఆర్'..
# అంకెల గారడీనా?




**కాగితాల్లో కోట్ల సంక్షేమం..తీరంలో కాలుష్య విషయం! ప్రతి పైసాకు ప్రజా ఆడిట్ జరగాల్సిందే!**




- రూ.128కోట్లు జాడేది..అభివృద్ధి ఎక్కడ?
- ఆడిట్ రిపోర్టుల్లో అంకెల విందు.. క్షేత్రస్థాయిలో కాలుష్య నరకం!
- స్థానికులకు మొండిచేయి.. వలస వాసులకు పీట! యువతకు ఉపాధి ఎక్కడ?
- లక్షల మందికి వైద్యం కాగితాలకే పరిమితమా? 'మెడికల్ ఆడిట్' రిపోర్టులు బయటపెట్టాలి!
- కలుషిత జలాల్లో చనిపోతున్న చేపలు.. ఉపాధి కోల్పోయిన మత్స్యకారుల ఆకలి కేకలు!
- ప్రతి పైసా ప్రజలదే! చట్టబద్ధమైన ఆడిట్ రిపోర్టుల్లో ఎందుకు దాగుడుమూతలు?

**సిఎస్ఆర్ మూటల చాటున సామాన్యుల ఆర్తనాదం**

కాకినాడ పారిశ్రామిక తీరంలో 'కోరమండల్' అంకెల గారడీ సాగుతోందా... ఆడిట్ కాగితాల్లో వందల కోట్ల సంక్షేమం వెలుగులు జిమ్ముతుంటే.. క్షేత్రస్థాయిలో మాత్రం సామాన్యుడి బతుకు కాలుష్య కోరల్లో చిక్కుకుని విలవిలలాడుతోందా.. రూ.128 కోట్ల 'సామాజిక బాధ్యత' నిధులు ఎటు మళ్లాయి? సొంతూరులో యువతకు మొండిచేయి చూపి, వలస వాసులకు పీట వేస్తున్న కంపెనీ తీరుపై ఇప్పుడు సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. లక్షల మందికి వైద్యం అందించామన్న కాగితపు లెక్కలకు, కాలుష్యంతో అల్లాడుతున్న బాధితుల ఆవేదనకు ఎక్కడా పొంతన లేదని ... మత్స్యకారుల ఉపాధిని చిదిమేస్తున్న కలుషిత జలాల సాక్షిగా.. ప్రతి పైసాకు లెక్క తేలాల్సిందేనని బాధితులు గర్జిస్తున్నారు. నిబంధనల తుంగలో తొక్కి సాగుతున్న ఈ 'కార్పొరేట్ మాయాజాలం'పై సామాన్యులే స్వచ్ఛంద ఆడిట్‌కు సిద్ధమవుతున్న వేళ.. అసలు గుట్టు రట్టు చేసేలా విశ్వసనీయ సమాచారం మేరకు ఉమ్మడి గోదావరి జిల్లాల 'సూర్య' బ్యూరో అందించిన క్షేత్రస్థాయిలో పరిశోధనాత్మక కథనం...


- మిగతా 2 లో..


ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

## 9 నెలలలో 281 గర్భస్రావాలా..?

**-మండలిలో ప్రశ్నించిన ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్**

**పెరవలి,మేజర్‌న్యూస్ :** ఏలూరు జిల్లా ఏజెన్సీ ఐదు మండలాల్లోని ప్రభుత్వాసుపత్రిలో 9 నెలలుగా 281 అబార్షన్‌జరగటం తీవ్రమైనవిషయంఅని శాసన మండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ శాసనమండలి లో ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ఎందుకు ఇలా జరిగిందనే విషయంపై ఆలోచించాలని గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పోషకాహారం , సరిపడే మందులు సకాలంలో అందించాలి అన్నారు. ఆరోగ్య కేంద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వైద్యులు, ఆశవర్కర్లునర్సింగ్ సిబ్బందిని అందుబాటులో ఉంచి తగినమందులుకూడా అందుబాటులో ఉంచాలన్నారు. ఏజెన్సీలో అబార్షన్లపై, ఎస్సీ ఎస్టీ వర్గాలకు చెందిన ఎమ్మెస్ఎంఈ లపై ఫిబ్రవరి 26వ తేదీ గురువారం ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏజెన్సీ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రులలో5 మండలాల్లో గత 9 నెలల్లో 281అబార్షన్స్(గర్భస్రావాలు) జరిగాయని ఇది చాలా తీవ్రమైన విషయం అన్నారు. ప్రభుత్వం




వెంటనే ప్రత్యేక బృందాల్ని ఏర్పాటుచేసి, నిజంగా అబార్షన్స్ జరిగాయా లేదా ప్రభుత్వం ఇచ్చిన డెలివరీటార్గెట్స్ పూర్తి చేయలేక ఇలా ఫాల్స్ అబార్షన్స్ రికార్డ్ చేస్తున్నారా అనే విషయాన్ని పరిశోధించాలి అని అన్నారు . ఒకవేళ నిజంగా అబార్షన్స్ జరిగితే అందుకు గల కారణాలను గుర్తించి గర్భిణి మహిళల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, పోషక ఆహారం, సప్లమెంటరీ మందులు


- తరువాయి 2లో..


## 'పెదకొండ'లో పెద్దపులి అలజడి!

**- పశువులపై దాడి - భయాందోళనలో గిరిజనులు**
**- గ్రామాన్ని సందర్శించిన అటవీ సిబ్బంది**





**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** గత నాలుగు రోజులుగా పోలవరం జిల్లా రంపచోడవరం అటవీ ప్రాంతంలో పెద్దపులి అలజడి సృష్టించడంతో ప్రజలు భయకంపితులవుతున్నారు. కొన్ని గ్రామాల ప్రజలు కంటిమీద కునుకు లేకుండా పెద్దపులి ఏసమయంలో గ్రామంమీదదాడి చేస్తుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రంపచోడవరం మండలం మర్రి వాడ పంచాయతీ పెదకొండ గ్రామంలో బుధవారం రాత్రి పెద్దపులి సంచారం కనబడిందని గ్రామ గిరిజనులు స్పష్టంగా చెబుతున్నారు. గ్రామంలో పశువులపై దాడి చేయడంతో ఆవులు, దూడలు గాయపడి నట్లు గిరిజనులు పేర్కొన్నారు. రంపచోడవరం మండలం లో రంప, మర్రివాడ, పెదకొండ అటవీ ప్రాంతాల్లో పులిసంచారం కనిపించడంతో గిరిజనులు తీవ్ర ఆందోళనకుగురవుతున్నారు. పెద్దపులి సంచారంతో ఇళ్లు వదిలి బయటకు వచ్చేందుకే భయపడుతున్నామని, అటవీ ప్రాంతంలో పనులు చేసుకొని బ్రతికే తమకు రక్షణ కరువైందని గిరిజన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లోకి పెద్దపులి రాదని అటవీ ప్రాంతం లోని సంచరిస్తుందని అటవీశాఖ అధికారులు ఎంతగా చెప్పినప్పటికీ గిరిజనులు మాత్రం తమ ప్రాంతంలో సంచరిస్తున్న పెద్దపులిని పట్టుకొని దూరంగా ఇతర ఆటవీ ప్రాంతాలకు తరలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామంలో


- తరువాయి 2లో..

# కోరమండల్ 'సీఎస్ఆర్'..అంకెల గారడీనా?




**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** కాకినాడ పారిశ్రామిక తీరంలో ఎరువుల దిగ్గజం 'కోరమండల్ ఇంటర్నేషనల్' సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) పేరుతో చేస్తున్న ఖర్చులు ఇప్పుడు ప్రజల చర్చకు దారితీస్తున్నాయి. కంపెనీ తన ఆడిట్ నివేదికల్లో రంగుల చిత్రాలను చూపిస్తున్నప్పటికీ,క్షేత్రస్థాయిలోప్రజలు అనుభవిస్తున్న కాలుష్య నరకం ముందు ఆనిధులు ఏపాటివి అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా గత మూడేళ్లలో (2022-25) ఖర్చు చేసినట్లు చెబుతున్న సుమారు రూ.128 కోట్ల పారదర్శకతపై ఇప్పుడు సామాన్య ప్రజలు లోతుగా విచారణ కోరుతూ డిమాండ్ చేస్తున్నారు.

**వైద్యం పేరుతో 'కంటితుడుపు'.. బాధితుల ఆవేదన!**

కంపెనీ తన ఆడిట్ నివేదికల్లో ఆరోగ్య సంరక్షణ కోసం మూడు ఏళ్లలో దాదాపు రూ.45 కోట్లు మళ్లించినట్లు పేర్కొన్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. కంపెనీ చట్టప్రకారం ప్రతి ఏటా నిర్వహించాల్సిన 'హెల్త్ అండ్ సేఫ్టీ ఆడిట్' నివేదికలుఎక్కడఉన్నాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఫ్యాక్టరీ వెదజల్లుతున్న అమ్మోనియా సల్ఫర్ ఉద్గారాల వల్ల ఏ గ్రామంలో ఎంతమంది వృద్ధులు శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు, ఎంతమంది చిన్నపిల్లలు అనారోగ్యం పాలయ్యారు అనే ఖచ్చితమైన డేటా కంపెనీ దగ్గర ఎందుకు బహిర్గతంగా లేదు? కేవలం నలుగురు డాక్టర్లనుకూర్చోబెట్టి,ప్రాథమిక వైద్య శిబిరాలపేరుతో ఫోటోలు దిగి హడావిడి చేయడం తప్ప, పారిశ్రామిక కాలుష్యం వల్ల వస్తున్న దీర్ఘకాలిక రోగాలకు అవసరమైన ఖరీదైన మందులు కానీ,స్పెషలిస్ట్ వైద్య సేవలు కానీ అందించిన దాఖలాలు లేవు. ఏఏ గ్రామాల్లో రోగాలు ఎలా వస్తున్నాయి,ఆబాధితులకు ఎటువంటి మందులు అందిస్తున్నారనే 'వైద్య ఆడిట్' వివరాలను కంపెనీ వెల్లడించకుండా చేసేఖర్చుఅంతా వృధాగానే ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**ఆడిట్ పత్రాల విశ్లేషణ - దాగుడుమూతలు ఎందుకు?**

కంపెనీ సమర్పించిన ఆడిట్ పత్రాలను లోతుగా పరిశీలిస్తే అనేక విస్మయకర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నిధుల కేటాయింపుల్లో చూపించిన ఖర్చుకు, క్షేత్రస్థాయిలో జరిగిన పనికి పొంతన లేకపోవడం గమనార్హం. పర్యావరణ పరిరక్షణ కోసం ఖర్చు చేసినట్లు చెబుతున్న కోట్లాది రూపాయల పద్దుల్లో పారదర్శకత లోపించింది. ముఖ్యంగా బాహ్య ఆడిటర్ల ద్వారా జరగాల్సిన తనిఖీలు కేవలం మొక్కుబడిగా సాగుతున్నాయా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఏ ఏ గ్రామంలో ఎంత ఖర్చు పెట్టారోస్పష్టమైనరికార్డులు ప్రజల ముందుకు ఉంచకుండా, కేవలం గుత్తాధిపత్యంతో అంకెల గారడీ చేయడం ప్రజలను మోసం చేయడమేనని మేధావులు మండిపడుతున్నారు. ఈ ఆడిట్ పత్రాల వెనుక ఉన్న అసలు నిజాలనువెలికితీయాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉంది.

**ఇంపాక్ట్ అసెస్మెంట్ - కాగితాలకే పరిమితమైన అభివృద్ధి!**

కంపెనీ తన సి.ఎస్.ఆర్ నివేదికల్లో 'ఇంపాక్ట్ అసెస్మెంట్' ద్వారా అద్భుతమైన మార్పులు వచ్చాయని డబ్బా కొట్టుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ ప్రభావం ఎక్కడా కనిపించడం లేదు. రూ.128 కోట్లు ఖర్చు చేసిన తర్వాత స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు ఎంత పెరిగాయి? ఎంతమంది మత్స్యకారులఉపాధి మెరుగుపడింది? కాలుష్యం ఎంత మేర తగ్గింది? అనే ప్రశ్నలకు ఈ అసెస్మెంట్ నివేదికలు సమాధానం చెప్పలేకపోతున్నాయి. ప్రజల కళ్ళకు గంతలు కట్టి, స్వతంత్ర సంస్థలతో కాకుండా తమకు అనుకూలమైన వారితో ఈ ప్రభావ అంచనాలు వేయించుకోవడం వల్ల వాస్తవాలు మరుగున పడిపోతున్నాయి. ఈ అసెస్మెంట్ నివేదికలను బహిరంగ పరచాలని, అప్పుడే కంపెనీ చేసే ఖర్చులోని డొల్లతనం బయటపడుతుందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**జవాబుదారీతనం - చట్టబద్ధమైన నిబంధనలు!**

భారత కంపెనీల చట్టం-2013,సెక్షన్ 135 ప్రకారం సామాజిక బాధ్యత నిధుల ఖర్చుపై కంపెనీలు ప్రజలకు అత్యంత జవాబుదారీగా ఉండాలి. కేవలం నిధులను కేటాయించడం మాత్రమే కాకుండా, ఆ నిధుల వల్ల సమాజంలో వచ్చిన వాస్తవిక మార్పుపై 'ఇంపాక్ట్ అసెస్మెంట్' నివేదికను బహిర్గతం చేయడం తప్పనిసరి.ప్రజలఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని ప్రభావితం చేసే పరిశ్రమలు తమ సిఎస్ఆర్ కార్యకలాపాలను స్థానిక ప్రజల భాగస్వామ్యంతో, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలి. ఈ నిధులు పరోక్షంగా ప్రజల ఆస్తి కాబట్టి, ప్రతి పైసా ఏ గ్రామంలో, ఏ వ్యక్తికి, ఏ అవసరం కోసం ఖర్చు చేశారనే సమగ్ర వివరాలను సోషల్ ఆడిట్ ద్వారా ప్రజల ముందుకు ఉంచాల్సిన చట్టబద్ధమైన బాధ్యత కంపెనీపై ఉంది.

**గ్రామ సభల పాత్ర - ప్రజాస్వామ్య విధ్వంసం!**

రాజ్యాంగంలోని 73వ సవరణ మరియు పంచాయతీ రాజ్ చట్టాల ప్రకారం, గ్రామాభివృద్ధికి సంబంధించిన ఏ నిర్ణయమైనా గ్రామ సభ ఆమోదంతోనే జరగాలి. సి.ఎస్.ఆర్ నిధులు ఏపనులకు ఖర్చు చేయాలి, ఏవి అత్యవసరమైనవి అనే అంశాలను గ్రామ సభలో చర్చించి, ప్రజల అవసరాలకు అనుగుణంగా తీర్మానాలు చేయాలి. కానీ, కోరమండల్ ఇంటర్నేషనల్ తన ప్రాజెక్టుల అమలులో ఇటువంటి ప్రజాస్వామ్య ప్రక్రియను అనుసరించిందా? ప్రజల ఆవేదనను వినే గ్రామ సభలను నిర్వహించిందా? లేక ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని నిధులను మళ్లించిందా? అనే కోణంలో లోతైన విచారణ జరగాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామ సభల అనుమతి లేకుండా చేసే పనులు కేవలం ప్రచారానికే తప్ప ప్రజా ప్రయోజనం కోసం కావని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

**నైపుణ్యాభివృద్ధి - ఉద్యోగాలు ఎక్కడ? పేర్లు బహిర్గతం చేయాలి!**

కంపెనీ ఏటా వందలాది మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నట్లు రికార్డుల్లో చూపిస్తోంది. దీని కోసం మూడు ఏళ్లలో సుమారు రూ.35 కోట్లు వెచ్చించినట్లు లెక్కలు చెబుతున్నాయి. కానీ, ఈ నిధుల వినియోగంపై ప్రజలు ఇప్పుడు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఏ ఏ గ్రామాల్లో ఎంత మంది విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దారు? ఆ గ్రామాల పేర్లు ఏమిటి? శిక్షణ పొందిన ఆ యువతలో ఎంతమందికి నిజంగా అదే ఫ్యాక్టరీలో ఉద్యోగాలు లభించాయి? అన్న వివరాలను కంపెనీ వెంటనే బహిర్గతం చేయాలి. శిక్షణ పొందిన యువత పేర్లు, వారికి ఉపాధి కల్పించిన గ్రామాల వివరాలు బయటపెడితేనే, కంపెనీ సామాజిక బాధ్యతపై నమ్మకం కలుగుతుందని, పొల్యూషన్‌తో బాధపడుతున్న ప్రజలకు కొంత ఊరట లభిస్తుందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**నివేదికలు ఇవ్వకుండా హడావిడి చేయడం వృధా!**

గత మూడేళ్లలో పర్యావరణ పరిరక్షణ పేరుతో మరో రూ.36 కోట్లు ఖర్చు చేశామని చెబుతున్న కోరమండల్ యాజమాన్యం, ఆ నిధుల పూర్తి వివరణను ప్రజలకు ఇవ్వాల్సిన అవసరం ఉంది. సామాజిక బాధ్యత అంటే కేవలం ట్యాక్స్ మినహాయింపుల కోసం చేసే ఖర్చు కాదు, అది ప్రజల ప్రాణాల పట్ల ఉండాల్సిన జవాబుదారీతనం. చట్టం ప్రకారం ఫ్యాక్టరీ తయారు చేయాల్సిన ఆడిట్ నివేదికలను ప్రజల ముందుకు ఉంచాలి. అప్పుడే అది నిజమైన సామాజిక సేవ అవుతుంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఈ భారీ నిధుల ఖర్చుపై, ముఖ్యంగా ఉపాధి మరియు వైద్య సేవలపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వ స్పందన కోరుతూ ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

# 9 నెలలలో 281 గర్భస్రావాలా..?

మొదటిపేజి తరువాయి

సకాలంలో అందించాలి అని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుట్టాయి గూడెం, పోలవరం ,జీలుగుమిల్లి,కుక్కునూరు, వేలూరుపాడు మండలాలలోని 15 ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, మందులు,ఆశకార్యకర్తలు అందు బాటులో ఉంచి ఏజెన్సీ మహిళల ఆరోగ్యాన్ని కాపాడుతూ వారికుటుంబాలలో విషాదాలు లేకుండా చూడావలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని తెలిపారు. మరొక ప్రశ్నగా ఎమ్మెస్ఎంఈ షెడ్యూల్ కులాల వర్గాలకు చెందిన వారికి గత ఏడాది ఇన్సెంటివ్స్ సక్రమ విధానంలో ఇవ్వలేదని, విధి విధానాలు చూడకుండా రాజకీయ కోణంలో చూసి, అనుకూలవర్గాలకు మాత్రమే ఇన్సెంటివ్స్ ఇచ్చారని, తద్వారా అనేక షెడ్యూల్డ్ కులాలు చిన్న పరిశ్రమలు ఆర్థిక ఇబ్బందుల బారిన పడ్డాయని ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ శాసనమండలి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కొన్ని ఎంఎస్ఎంఈ లకు ఇబ్బందుల మూలంగా, వారికి ప్రాధాన్యత ఇచ్చామని అనగా ఇబ్బందులను ఎలా కొలుస్తారని రవీంద్ర నాథ్ ప్రశ్నించారు. మన వాళ్ళు, మన అనుకూలురు అయితే వాళ్లకు ఇబ్బందులు ఉన్నాయని, ఇతర పార్టీ అనుకూల వారైతే, ఇబ్బందులు లేని వారని ఆనేగా అర్థం అవుతుందని అడగ్గా సభ నవ్వుల పర్యం తమైంది. అందర్నీ ఒకేలా చూసి షెడ్యూల్ కులాల ఎమ్మెస్ఎంఇలను ప్రోత్సహించాలని రవీంద్ర నాథ్ డిమాండ్ చేశారు.

# 'పెదకొండ'లో పెద్దపులి అలజడి!

మొదటిపేజి తరువాయి

పశుసంపదపై పెద్దపులి దాడి చేయడం వల్ల ఏ క్షణాన్నైనా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని గిరిజనులు పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో జీడి తోటలకు, ఇతర వ్యవసాయ పనులకు బయట తిరగాలంటేనే భయపడుతున్నామని, పశువులను ఎక్కడ దాచుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొందని గిరిజనులు అన్నారు. పెదకొండ గ్రామంలో పెద్దపులి అడుగు జాడలు కనిపించాయని, దీనిపై రెండు రోజులు పాటు గ్రామ పరిసరాల్లో పరిస్థితులు పరిశీలిస్తామని ఉన్నతాధికారులకు దీనిపై నివేదిస్తామని సంబంధిత అధికారులు పేర్కొన్నారు కాగా పెద్దపులి దాడిలో గాయపడిన పశువులకు పశు వైద్య సిబ్బంది చికిత్స చేశారు. ఇటీవల పాపికొండలు అభయారణ్యంలో విడిచిపెట్టిన పెద్దపులి రంపచోడవరం మండలంలోని అటవీ ప్రాంతం పరిధిలోని గ్రామాలకు వచ్చిందా లేక మరో పులి ఈ ప్రాంతానికి వచ్చిందా అనే దానిపై అటవీశాఖ అధికారులు ఇంకా స్పష్టత ఇవ్వలేదు. పాపికొండలు అభయా రణ్యంలో వదిలిన పెద్దపులి అక్కడే అటువైపు అటవీ ప్రాంతంలోనే ఉందని రాజమండ్రిలో అటవీశాఖ ఉన్నతాధికారి ఒకరు ప్రకటించగా పోలవరం జిల్లా అటవీ శాఖ అధికారి మాత్రం రంపచోడవరం అటవీ ప్రాంతంలో పులి సంచారం నిజమేనని ప్రకటించడంతో గందరగోళ పరిస్థితులు నెలకున్నాయి.ఇదిలా ఉండగా ఏజెన్సీ గ్రామాల్లో పెద్దపులి సంచారంతో గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పశువులపై దాడి చేస్తే నష్టపరిహారం ఇస్తామని చెబుతున్న అటవీశాఖ అధికారులు మనుషుల ప్రాణాలతో చెలగాటం ఆడటమేమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటవీ ప్రాంతంలో పనులు చేసుకొని జీవించే గిరిజనులు కొండ ప్రాంతాల్లో తిరగకుండా ఇళ్ళలో కూర్చోమని చెప్పడం తగదన్నారు. పెద్దపులి విషయంలో ప్రభుత్వం చర్యలుతీసుకోవాలని,ప్రజలకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# విద్యుత్ సరఫరా అంతరాయం

**పెరవలి, మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి 27 శుక్రవారం ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం మల్లేశ్వరం గ్రామంలో 33/11 కె.వి సబ్ స్టేషన్ నందు వార్షిక మర్మతులలో మరియు ట్రీ కట్టింగ్‌లలో భాగంగా మల్లేశ్వరం, అన్నవరప్పాడు, కడింపాడు, పిట్టల వేమవరం గ్రామములకు విద్యుత్ అంతరా యం కలుగును. వ్యవసాయ వినియోగదారులకు ఉదయం 6 గం.ల నుండి 8 గం.ల వరకు మరియు మధ్యాహ్నం 2గం.ల నుండి సాయంత్రం 06:00 గంటల వరకు సరఫరా చేయబడును. కావున గృహ మరియు వాణిజ్య ,విద్యుత్ వినియోగదారులు సహకరించవలసినదిగా 33/11 కె.వి సబ్‌స్టేషన్ పెరవలి నందు 11 కె.వి మల్లేశ్వరం మరియు ఖండవల్లి ఫీడర్స్ ట్రీ కటింగ్‌లలో భాగంగా ఖండవల్లి, నల్లకులవారిపాలెం, ముక్కామల, కొత్తపల్లి గ్రామములకు విద్యుత్ అంతరాయం కలుగును. వ్యవసాయ వినియోగదా రులకు ఉదయం 6గం.ల నుండి 8గం.ల వరకు మరియు మధ్యాహ్నం 2గం.ల నుండి సాయంత్రం 06:00 గంటల వరకు సరఫరా చేయబడును. కావున గృహ మరియు వాణిజ్య, విద్యుత్ వినియోగదారులు సహకరించవలసినదగా ఎన్.నారాయణ అప్పారావు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ నిడదవోలు వారు కోరుతున్నారు.

# వెంకన్న నిత్య అన్నదాన పథకానికి రూ.5 లక్షలు విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి నిత్య అన్నదాన పథకానికి గురువారం విజయవాడ ప్రసాదంపాడుకు చెందిన వెంకట దుర్గ స్టిల్స్ వారు గంధం రాజేష్ కుమార్, దుర్గాదేవిలి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.5,00,001లు విరాళంగా అందించారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శేష వస్త్రములతో సత్కరించారు. చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

# ఏలేరు వంతెనకు మహర్దశ

**– క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఇంజనీరింగ్ చీఫ్**



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏలేశ్వరం – జగ్గంపేట నియెజకవర్గ ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతోందని కూటమి నాయకులు అభిప్రాయ పడ్డారు. అప్పన్నపాలెం వంతెనను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ చీఫ్ ఇంజనీర్ కె.విజయ కుమారి స్థానిక నాయకులు అలమండ చల మయ్య, బొద్దిరెడ్డి గోపి,మూది నారాయణస్వామిలతో కలిసి పరిశీలిం చారు. స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిశీలించి వంతెన నిర్మా ణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్, పీఎంజీఎస్వై, నాబార్డ్ వంటి పథకాలతో పంచాయ తీరాజ్ శాఖలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మారుతున్నాయని ఇందులో భాగంగానే ఏలేశ్వరం, జగ్గంపేట ప్రధాన అనుసంధాన వంతెన (అప్పన్నపాలెం వంతెన) సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని తెలిపారు. మారుమూల గ్రామాల నుంచి ఏలేశ్వరానికి వచ్చే గర్భిణీలు, వృద్ధులు విద్యార్థులు, పడుతున్న ఇబ్బందులను గమనించిన పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ విజయ కుమారి దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఏలేరు రిజర్వాయర్ నుండి వచ్చే భారీ డిశ్చార్జ్‌ను తట్టుకునేలా, 7.5 మీటర్ల వెడల్పుతో అత్యాధునిక 'టూ–లేన్' హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి డిజైన్ సిద్ధమైందని అన్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే రూ18 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల నిరంతర కృషితో ఈ పనులు వేగవంతం అయ్యాయన్నారు. సాయిల్ ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి, నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే సెంటర్ పాయింట్‌నే నిర్మాణానికి ఎంచుకున్నారు. వచ్చే ఒకటిన్నర ఏళ్లలో ఈ వంతెనను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా యంత్రాంగం కసరత్తు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల చొరవతో ఏజెన్సీ ఏరియాలో 'అడవి తల్లి బాట' లాంటి కార్యక్రమాలతో పాటు, ఈ వంతెన నిర్మాణం కూడా త్వరితగతిన పూర్తి కానుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎండగుశీడి నాగబాబు, కోణాల వెంకటరమణ,పెంద్ర శ్రీను, మామిడి లలిత, రాయుడు చిన్న, సామంతుల గోపి, వాగు రాజేష్ తదితర కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 11 నెలల బాలికతో సహ కాలువలోకి దూకిన ఘనుడు - బాలిక మృతి



**జగ్గంపేట,మేజర్‌న్యూస్ :** మద్యం మత్తులో 11 నెలల బాలికతో సహ పోలవరం కాలువలోకి సంఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శెట్టిబలిజి పేటకు చెందిన ఒడిబోయిన మణికంఠ భార్య ఇద్దరు కుమార్తెలతో టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. గురువారం తన భార్య సాయితో ఘర్షణ పడి 11నెలల కుమార్తెను తీసుకుని బైక్‌పై బయటకు వచ్చాడు. అలా వెళ్ళిన మణికంఠ బైక్‌తో సహ పోలవరం కాలువలోకి దూకాడు. శబ్దాన్ని విన్న స్థానికులు వారిని రక్షించి వైసిపి నేత ఒమ్మి రఘురామ్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన తన కారులో ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే బాలిక మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు. ఐతే మణికంఠ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. నన్ను గాయపరిచి నా కూతుర్ని తీసుకువెళ్లి ఇలా శవ ంగా మార్చాడని తల్లిసాయిఆవేదనతో ఆరోపించింది. మద్యంమత్తులో ఉన్న అతనికి బాలిక తల్లి, బంధువులు దేహశుద్ధి చేశారు. ఈ మేరకు ఎస్ఐ రఘునాథరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు శిబిరం ప్రారంభం..



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఎర్రవరం గ్రామంలో గంగిరెడ్ల మణికంఠ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు శిబిరానికి ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్య కిరణ్ (బాబీ) గురువారం హాజరై శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మేడిశెట్టి బాబి మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 16 సభ్యత్వ నమోదు శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వం నమోదు చేయించుకోవాలని అన్నారు. అలాగే మీ సహాయ సహకారాలు జనసేన పార్టీకి అందించాలని, నియోజకవర్గ వ్యాప్తంగా 20వేల మందికి సభ్యత్వాలు నమోదు చేసేలా జన సైనికులు కృషి చేయాల న్నారు. అనంతరం లింగపర్తి సొసైటీ అధ్యక్షులు పెంటకోట మోహన్ మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రతి సంవత్సరం ఎంతో ప్రతిష్టాత్మకంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తోట గోపాలకృష్ణ, ఆకుల నాని, పలివెల వెంకటేష్, వీరబాబు, బ్రహ్మానందం, బంక కోదండరాం, గంగిరెడ్ల బాలాజీ, ప్రసాద్, బొట్టా సురేష్, ప్రకాష్, సిరిపురం శ్రీను తదితర జనసైనికులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన ఎంపిడిఓ





**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్:** పెద్దాపురం మండలంలో పలు అభివృద్ధి పనులు గురువారం ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ, డిప్యూటి ఎంపిడిఓ జి.శేఖరరెడ్డితో కలసి పరిశీలించారు. దీనిలో భాగంగా ఆర్.బి.పట్నం, ఆర్.బి. కొత్తూరు గ్రామంలో ఎన్ఆర్ఇజి ఎఎస్ నిధులతో నిర్మిస్తున్న డ్రైన్ల నిర్మాణ పనులను పరిశీలించి, సిబ్బంది పలు సూచనలు చేశారు. అలాగే ఇంటి పన్నుల వసూళ్ల తీరును పరిశీలించి త్వరితగతిన లక్ష్యాలను సాధించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నూనె రామారావు, సచివాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# గిరిజన విద్యార్థికి మెడికల్ పట్టా

**– చదువులో ఆణిముత్యం భాగ్యరేఖ**
**– అక్క బాటలో చెల్లి స్వర్ణ రేఖ**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని రాజవొమ్మంగి గ్రామానికి చెందిన భాగ్యరేఖ చిన్నప్పటినుండి చదువుపై శ్రద్ధ చూపి మెడిసిన్ సీటు సంపాదించి తల్లిదండ్రుల సమక్షంలో మెడికల్ పట్టా పొందడం ఏజెన్సీకే గర్వకారణం. రాజవొమ్మంగి గ్రామానికి చెందిన జెసి జె వి ఎస్. నాయకులు (స్కూల్ అసిస్టెంట్ సోషల్) గా చింతూరు మండలం మల్లెతోట ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా అతని భార్యసుభాషిణి ( స్కూల్ అసిస్టెంట్ సోషల్) చింతూరు మండలం కల్లేరు ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నరు. ఈ దంపతుల కుమార్తెలైన భాగ్యరేఖ రాజమండ్రి మెడికల్ కాలేజీలో వైద్య పట్టా అందుకున్నారు. ఇది ఇలా ఉండగా ఆమె సోదరి స్వర్ణ రేఖ కూడా కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో ప్రథమ సంవత్సరం వైద్య విద్య అభ్యసిస్తున్నారు.ఒక ప్రక్క వీరి తల్లిదండ్రులు ఎంతోమంది విద్యార్థులకు విద్యను అందించి వారికి మంచి బాటను చూపించినదే కాకుండా తమ కుమార్తెలను సైతం ఫ్రీ సీట్లతో వైద్య విద్య అందేలా తోడ్పడి వైద్యులను చేయడంపై రాజవొమ్మంగి మండల ప్రజలు, బంధుమిత్రులు, ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు వీరి కుటుంబాన్ని అభినందిస్తున్నారు.

## ఈ నెల 28న ఫించన్ల పంపిణీ

**- కమీషనర్ శ్రీకాంత్‌రెడ్డి**



**పెద్దాపురం,మేజర్ న్యూస్ :** ఎన్‌టిఆర్ భరోసా పథకం క్రింద ఫించనుదారులకు మార్చి నెలకి సంబంధించి ఒకరోజు ముందుగానే ఫించన్ల పంపిణీ చేయను న్నట్లు మున్సిపల్ కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మార్చి 1ఆదివారం కావడంతో ఫిబ్రవరి 28న శనివారం మున్సిపాల్టీలో వార్డు సచివాలయాల పరిధిలో ఫించనుదారులకు ఫించన్లుపంపిణీచేయడం జరుగుతుందని కమీషనర్ తెలిపారు.మార్చి నెలకు సంబంధించి పురపాలక సంఘంలో 5967 ఫించనుదారులకు గాను రూ.2కోట్ల 60 లక్షల 63వేల రూపాయలు ఫించన్లు పంపిణీ చేయడం జరుగుతుందని, కమీషనర్ తెలిపారు.

సూర్య www.suryaa.com

మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678

అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ,
ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు,
మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# రైతాంగ సమస్యలపై మండల సమావేశం గరం గరం



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** మండలంలోని రైతుల ఎదుర్కొంటున్నా సమస్యలపై మండల సర్వసభ్య సమావేశం గరం గరంగా మారింది . గురువారం మధ్యాహ్నం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తొలుత మండల అగ్రికల్చర్ అధికారి మురళి మాట్లాడుతూ రైతులకు సొసైటీల ద్వారా సరఫరా చేస్తున్న యూరియా బస్తాల వలన రైతులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. దీనిపై మండల వైస్ ప్రెసిడెంట్ పేర్ని రాయుడు మాట్లాడుతూ ఈ పద్ధతి వలన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తమ గ్రామం నుంచి వేరే ప్రాంతం వెళ్లి ఎరువులు బస్తాలు తెచ్చుకోవాల్సి వస్తుందని అభ్యంతర వ్యక్తం చేశారు. అన్నదాత సుఖీభవ పై ఎంపీ పి.సత్తిబాబు మాట్లాడుతూ సగం రైతులకు అన్నదాత సుఖీభవ అందడం లేదని దీనిపై వ్యవసాయ అధికారులు ఈ విషయం పట్టించుకోవడంలేదని అన్నారు. మండలంలో 14 వేల రైతాంగం ఉండగా మిగతా 7000 రైతులకు ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. రైతుల సమస్యలు పరిష్కారానికి గ్రీవెన్స్ పెట్టమని అడుగుతుండగా అగ్రికల్చర్ అధికారులు పట్టించుకోలేదని తక్షణం వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకుని గ్రీవెన్స్ పెట్టే విధంగా చూడాలని ఎంపీపీ డిమాండ్ చేశారు. ఎంపిటిసి శివ కుమార్ మాట్లాడుతూ వికే.రాయపురం కొత్తూరులో ప్రాథమిక పాఠశాలలో టాయిలెట్స్ అందుబాటులో లేక యూరినల్స్ ఆరు బయట వేసుకోవాల్సి వస్తుందని బాత్రూములకు టాయిలెట్స్‌కి తాళాలు వేయడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై మండల విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండలం వైస్ ప్రెసిడెంట్ ములస శ్రీనివాస్ విద్యా హక్కు చట్టం కింద కార్పొరేట్ పాఠశాలలో సీట్లు ఇవ్వడం లేదని అన్నారు. మండలంలోని లక్ష్య, లిటిల్ వుడ్స్ ఢిల్లీ స్కూల్ మొదలగు పాఠశాలలో విద్య హక్కు క్రింద పేద పిల్లలకు సీట్లు ఇవ్వడం లేదని దీనిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మండల విద్యాశాఖ అధికారి తులసి, పి.పుల్లయ్య తక్షణం చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం వివిధ రకాల అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ కే.హిమామహేశ్వరి, తాసిల్దార్ కే చంద్రశేఖర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు సొసైటీ ప్రెసిడెంట్లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పింఛన్ పంపిణీ, అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం

**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ మండల కేంద్రమైన అడ్డతీగలలోని స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో కుమార్ అధ్యక్షతన మండలంలోని పంచాయతీ అభివృద్ధి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మార్చి ఒకటో తేదీ ఆదివారం రావడం వల్ల ఈనెల 28 శనివారం మండల వ్యాప్తంగా పింఛనుదారులందరికీ పింఛను పంపిణీ చేయాలని అందుకు పంచాయతీ అధికారులు 27వ తేదీ శుక్రవారం బ్యాంకు నందు పింఛను సొమ్ము డ్రా చేసి పంపిణీలో పాల్గొనే సచివాలయ సిబ్బంది అందరికీ అందజేయాలని అలాగే అన్ని గ్రామాల పరిధిలో 27వ తేదీ దండోరా వేయించి పింఛనుదారులు 28వ తేదీన ఇంటి వద్ద ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే మండలంలో మందకొడిగ జరుగుతున్న యునైటెడ్ సర్వే పూర్తి చేయాలని డిజిటల్ అసిస్టెంట్లు కట్టవలసిన ఈ సర్వీస్ ఎమౌంట్లు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ప్రభుత్వ నిధులకు జమ చేయాలని ఆదేశించారు మండలంలోని అడ్డతీగల-1, గొంటువానిపాలెం, భీముడు పాకలు, దుశ్చర్తి, దాకోడు పంచాయతీలకు సంబంధించి ఈనెల 28 నాటికి ఇంటి పన్ను బాకీలు పూర్తిస్థాయిలో వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. అసెంబ్లీ ఓటర్ల జాబితాను అనుసరించి గ్రామపంచాయతీ వారిగా ఓటర్ల




జాబితాను తప్పులు లేకుండా తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. మండలంలోని వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లందరూ తమ పరిధిలోని పాఠశాలలను సక్రమంగా సందర్శిస్తున్నారా లేదా అనే విషయాలు కూడా ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పాలకేంద్రాల్లో విస్తృత తనిఖీలు..



సామర్లకోట, మేజర్ న్యూస్ : రాజమండ్రిలో కల్తీ పాలు తాగి ఐదుగురు మృతి చెందిన ఘటనపై సామర్లకోట పట్టణంలో గురువారం పాల కేంద్రాలను కాకినాడ జిల్లా ఆహార భద్రత అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రమీల ఆదేశాలతో ఫుడ్ సేఫ్టీ అధికారి సుబ్బారావు, ఇతర అధికారులు సామర్లకోట పట్టణంలోని విగ్నేశ్వర థియేటర్ ఎదురుగా ఉన్న శ్రీనివాస పాలకేంద్రాన్ని, పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామంలోని ఒక పాలకేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు సేకరిస్తున్న పాలనుంచి సాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా అధికారి సుబ్బారావు మాట్లాడుతూ రాజమండ్రిలో తలెత్తిన కల్తీ పాలు నేపథ్యంలో కాకినాడ, సామర్లకోట, పెద్దాపురం మండలాల్లో గత రెండు రోజులుగా పాల కేంద్రాలను తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. దానిలో భాగంగానే స్థానికంగా శాంపిల్స్ సేకరించామని, వాటిని పరీక్షల నిమిత్తం లేబొరేటరీకి పంపించనున్నట్టు చెప్పారు. వాటి రిపోర్టు వచ్చిన తర్వాత ఏదైనా కల్తీ జరిగినట్టు తెలిస్తే పాలు విక్రయిస్తున్న యజమానులపై చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. అలాగే ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లలో ఉన్న పాల తయారీ కేంద్రాలను తరచుగా తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. అవి పాల శీతలీ కేంద్రాలుగా పనిచేస్తున్నందున వాటిలో పాలకల్తీ సందర్భాలు సుమారుగా బయట పడలేదన్నారు. అవకాశాన్ని బట్టి ఆ పరిశ్రమల్లో కూడా తనిఖీలు జరపనున్నట్టు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా సామర్లకోట పాలకేంద్రం నుంచి నాలుగు శాంపిల్స్‌ను అధికారులు సేకరించగా వాటిని ల్యాబ్‌కు పంపించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో ఇంకా ఫుడ్ సేఫ్టీ అధికారులు లక్ష్మక్క, సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల గూడు కోసం సిపిఐ ఫ్లెక్సీ పోరు



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** పేదల గూడు కోసం పిఠాపురం సిపిఐ నాయకులు సాకా రామకృష్ణ ఆధ్వర్యంలో ఫ్లెక్సీ పోరు కొనసాగుతుంది. కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇండ్ల స్థలాల హామీని మర్చిపోయిన నేపథ్యంలో ఫ్లెక్సీలతో గుర్తు చేస్తున్నామని సాకా రామకృష్ణ తెలిపారు. స్థానిక రామా టాకీస్ సెంటర్ వద్ద బాధితులతో కలిసి ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణాలో రెండు సెంట్లు ఇస్తామని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ హామీ ఇవ్వడం జరిగిందని, ఆమెని నమ్మి ఓట్లు వేయడం జరిగిందని, కూటమి ప్రభుత్వం పాలన చేపట్టి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఎన్నికల హామీలు నెరవేర్చకపోవడం దారుణం అన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. సేకరించిన భూమి ఉండగా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ ఫ్లెక్సీలు ప్రచారంతో ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కాకపోతే దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గాడి తరణీ, సికోటి సత్యవతి, కిల్లాడి రాజేశ్వరి, ఇంటి శ్రీదేవి, వంగలపూడి నాగమణి, పేపకాయల ప్రసాద్, మోర్త నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## చిత్రాడలో ఉత్సాహంగా జనసేన సభ్యత్వ నమోదు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** చిత్రాడ గ్రామంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు జోరుగా సాగుతుంది. గ్రామ కమిటీ 11వ వార్డు ఇంచార్జ్ పిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్ సమక్షంలో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఉద్యమి, సాధక్, ప్రదాత అనే మూడు కేటగిరీలలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన జనసేన క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా వేగంగా కొనసాగుతోందని, పార్టీ బలోపేతానికి సంకల్పబద్ధంగా రూ.2 కోట్లు విరాళంగా అందించి తొలి సభ్యత్వం స్వీకరించడం ద్వారా కార్యకర్తలకు పవన్ కళ్యాణ్ ప్రేరణగా నిలిచారని అన్నారు. ప్రతి కార్యకర్త తన బాధ్యతను గుర్తించి గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో సభ్యత్వ నమోదు ప్రక్రియకు మంచి స్పందన లభించిందని, పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సామాజిక న్యాయం లక్ష్యాల సాధనలో జనసేన పార్టీ ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, జనసైనికులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఒక రోజు ముందుగానే పెన్షన్ల పంపిణీ

**- ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ**



పెద్దాపురం రూరల్, **మేజర్ న్యూస్ :** మార్చి 1వ తేది ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే శనివారం ఫిబ్రవరి 28న (మార్చి నెల పెన్షన్లు) పెన్షన్లు పంపిణీ చేయడం జరుగుతుందని, ఎంపిడిఓ కె.వి.సూర్య నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ మండల పరిధిలోని 23 గ్రామాలలో పెన్షన్‌దారులు శనివారం ఇళ్ళ దగ్గర అందుబాటులో ఉండాలని, ఆయన పేర్కొన్నారు. మండలానికి సంబంధించి 11,430 పెన్షన్‌లకు గాను 4కోట్ల 92లక్షల 45వేల 500 రూపాయలు నిధులు మంజూరు అయ్యాయని, వీటిని ఆయా సచివాలయాల సిబ్బంది ద్వారా ఫించన్‌దారులకు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# ‘శరవణ’ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు, రైటింగ్ ప్యాడ్స్ పంపిణీ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ శరవణ ఆధ్వర్యంలో కాకినాడలోని ఎఎంజి స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల దృష్ట్యా పరీక్షల రైటింగ్ ప్యాడ్లు మరియు పెన్నులు పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించబడింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు అలై. యాళ్ళ రత్నారావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ తో చదివి, ఆత్మవిశ్వాసంతో పరీక్షలను ఎదుర్కోవాలని సూచించారు. పాఠశాలయాజమాన్యం మరియు ఉపాధ్యాయుల సేవలను అభినంది ంచారు.కార్యక్రమానికిముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాల ప్రధానోపాధ్యా యు రాలు చందన సోబ్బవరపు విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం అందించారు. ఆమె ఏ.పి.జె. అబ్దుల్ కలాం జీవితాన్ని ఉదాహరణగా చూపిస్తూ కష్టపడి పనిచేస్తే, క్రమశిక్షణతో ముందుకు సాగితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని వివరించారు. పెద్ద కలలు కనాలి, వాటిని నిజం చేసుకోవడానికి పట్టుదలతో శ్రమించాలి అని సూచించారు. క్లబ్ ఉపాధ్యక్షులు అలై. యడవిల్లి మురళీధర్ పరీక్షల భయాన్ని ఎలా అధిగమించాలో వివిధ ఉదాహరణలతో వివరించి విద్యార్థులను ఉత్తేజపరిచారు. ప్రతి ఒక్కరికి ఒక లక్ష్యంజ ఉండాలి, ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు.

క్లబ్ వ్యవస్థాపకుడు అలై. దిలీప్ కుమార్ సధనాని మాట్లాడుతూ ఇవి చిన్న కానుకలే అయినప్పటికీ వాటితో పాటు మా ఆశీర్వాదాలు, శుభాకాంక్షలు ఉన్నాయని తెలిపారు. 10వ తరగతి పరీక్షలు విద్యార్థుల జీవితంలో ఒక ముఖ్యమైన మెట్టు అని, కష్టపడి చదివి ధైర్యంగా, నమ్మకంతో పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షలను భయపడకూ డదని, అవి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరడానికి మెట్టుల వంటివని పేర్కొన్నారు. అలాగే అలై. కొవ్వూరి మునిరెడ్డి, అలై. ఆర్. రవిశంకర్ పట్నాయక్ మరియు అలై. సతీష్ నంబూరి విద్యార్థులను ప్రేరేపించినట్లు తెలిపారు.పంపిణీ కార్యక్రమంలో అలై. ఈశ్వరి మనోహర్ మలాది, అలై. శ్రీలక్ష్మి, అలై. పి.విజయలక్ష్మి, అలై.మృణాల్ వర్మ మలాది, నంబూరిసత్యదేవి పాల్గొన్నారు. ఉపాధ్యా యులు కె.శ్రీను,ఎం.సునిధి, జె.కమల కుమారి, ఎన్.సుబ్ర హ్మణ్యం, పి.మధు బాబు కార్యక్రమానికి సహకరిం చారు.రాబోయే పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులందరూ ఘన విజయం సాధించాలని కార్యక్రమం చివరలో ఆకాంక్షించారు.

# ఆదిత్యలో బీసీఏ విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై అవగాహన సదస్సు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల అనుబంధ సంస్థ ఆదిత్య స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ లో డాక్టర్ ప్రత్యూష అండ్ టీం ద్వారా ప్రస్తుత జీవన నైపుణ్యాలపై ప్రేరణాత్మక అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.బ్యూలా తెలియజేశారు ముఖ్య అతిధులుగా ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్ నాయుడు, ప్రిన్సిపాల్ డి.బ్యూలా, వైస్ ప్రిన్సిపాల్ జి.సత్య, అధ్యాపకులు మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ విద్యార్థులు ప్రజలతో సంభాషించడం, ఆరోగ్య వాహక సమయ ఆర్థిక నిర్వహణలు నిర్వహించడం, ధ్యానం చేయడం వల్ల ఒత్తిడిని జయించడం, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా ఒత్తిడి లేకుండా చూసుకోవడం, వివిధ డోమైనల నుండి వివిధ ప్రతిభావంతులుగా ఎదగడం, భద్రత మరియు చట్టబద్ధమైన అవగాహన ఏర్పాటు చేసుకోవడం, ఫోక్సో ప్రభావం మనపై పడకుండా జాగ్రత్తగ పడడం, దోపిడీ, రేగింగ్ వంటి వాటిపై అవగాహన చేసుకుని, జాగ్రత్త పడడం మాదక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా, ఆన్‌లైన్ బెట్టింగ్ ఉచ్చులో పడకుండా ప్రతి విద్యార్థి జాగ్రత్తగా ఉండాలని,




రోజువారి పోషకాహారం, ఆరోగ్యంపై శ్రద్ధ చూపిస్తూ వ్యాయామం చేయాలని విద్యార్థిని, విద్యార్థులను ఉద్దేశించి చక్కని మోటివేషన్ క్లాసు ఇవ్వడం జరిగినది.అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఇటువంటి అవగాహన సదస్సులు విద్యార్థినీ, విద్యార్థులకు ఎంతో అవసరమని, అకడమిక్‌తో పాటు ఇటువంటి అవగాహన సదస్సులు తమ కళాశాలలో నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

# పాల డైరీలు పై ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ






**– రాజమండ్రిలో కల్తీ పాలు ఘటన నేపథ్యంలో అప్రమత్తమైన ఉన్నతాధికారులు**

**రావులపాలెం, మేజర్ న్యూస్ :** ఇటీవల రాజమండ్రిలో కల్తీ పాలు సేవించి కొందరు మృతిచెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోనసీమ జిల్లాలో విస్తృత తనిఖీలు చేపట్టారు అందులో భాగంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆహార భద్రత అధికారి ఫుడ్ ఇన్స్పెక్టర్ యేపూరి రామయ్య ఆధ్వర్యంలో రావులపాలెం పట్టణంలోని పలు పాల కేంద్రాలు, మిల్క్ సెంటర్లను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాలు నిల్వ విధానం, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. పలు కేంద్రాల నుంచి పాలు శాంపిళ్లు సేకరించి ప్రయోగశాలకు పంపించినట్లు అధికారులు తెలిపారు. ల్యాబ్ నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నమూనాల్లో విషపదార్థాలు లేదా కల్తీ పదార్థాలు ఉన్నట్లు తేలితే సంబంధిత అమ్మందారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు నాణ్యమైన పాలను మాత్రమే వినియోగించాలని, అనుమానాస్పద పరిస్థితులు గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆహార భద్రతాధికారులు సూచించారు. ఇటీవలి ఘటనల నేపథ్యంలో జిల్లాలోని అన్ని మండలాల్లో తనిఖీలు కొనసాగనున్నట్లు తెలిపారు.

# అక్షయ సేవా సంస్థ ఆర్థిక సహాయం



**రావులపాలెం, మెజర్ న్యూస్ :** అనారోగ్యంతో బాధపడుతూ హాస్పిట ల్‌కి వెళ్లి ఖర్చు లేని స్థితిలో ఉన్న అభాగ్యాడుకి ఆర్థిక సహాయం అందించింది రావులపాలెంలోని అక్షయ సేవా సంస్థ. వివరాల్లోకెళ్తే మండల పరిధిలోని వెదిరేశ్వరం గ్రామనికి చెందిన కుర్రా చంద్ర రావు కొన్ని నెలల నుండి యూరిన్ ఇన్ఫెక్షన్ వల్ల ఆపరేషన్ అయి ంది. చంద్రరావు హార్ట్ కూడా స్లోగా కొట్టుకోవడం వలన హార్ట్ ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. వీళ్ళ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కారణంగా అక్షయ సేవా సంస్థను సహాయం కోర గా సంస్థ నుంచి 10,000 రూపాయలు; సంస్థ సభ్యులు కే.పావని 1000 మొత్తం 11,000 రూపాయలు వేదిరేశ్వరం గ్రామం వెళ్లి సంస్థ సభ్యులు చేతుల మీదుగా చందద్రావుకు ఇవ్వడం జరిగింది. దీనికి సహకరించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు బాధిత కుటుంబం.

# పేదల గూడు కోసం సిపిఐ ఫ్లెక్సీ పోరు



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** పేదల గూడు కోసం పిఠాపురం సిపిఐ నాయకులు సాకా రామకృష్ణ ఆధ్వర్యంలో ఫ్లెక్సీ పోరు కొనసాగుతుంది. కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇండ్ల స్థలాల హామీని మర్చిపోయిన నేపథ్యంలో ఫ్లెక్సీలతో గుర్తు చేస్తున్నామని సాకా రామకృష్ణ తెలిపారు. స్థానిక రామా టాకీస్ సెంటర్ వద్ద బాధితులతో కలిసి ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణాలో రెండు సెంట్లు ఇస్తామని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ హామీ ఇవ్వడం జరిగిందని, ఆమెని నమ్మి ఓట్లు వేయడం జరిగిందని, కూటమి ప్రభుత్వం పాలన చేపట్టి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఎన్నికల హామీలు నెరవేర్చకపోవడం దారుణం అన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. సేకరించిన భూమి ఉండగా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ ఫ్లెక్సీలు ప్రచారంతో ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కాక పోతే దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గాడి తరణీ, సికోటి సత్యవతి, కిల్లాడి రాజేశ్వరి, ఇంటి శ్రీదేవి, వంగలపూడి నాగమణి, పేపకాయల ప్రసాద్, మోర్త నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వెంకన్న సన్నిధిలో సినీనటులు అన్నపూర్ణ రజిత



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారిని గురువారం సినీ నటులు అన్నపూర్ణ రజిత తదితరులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించి స్వామి చిత్రపటాన్ని అందించారు.

# గోదావరి కాలువలో మెడికల్ వ్యర్థాలు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట పట్టణంలోని గోదావరి కాలువకు కాలుష్యం తప్పడం లేదు. ప్రజలు, రైతులు ఎంతకాలంగా మొర పెడుతున్నా అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో పలు పరిశ్రమల యజమానులు మరీ రెచ్చిపోతున్నారు. అది చాలదంటూ ప్రస్తుతం ఆసుపత్రి వ్యర్థాలు అంటే ఉపయోగించిన సిరంజీలు, ఇంజక్షన్ వ్యర్థాలు కూడా గోదావరి కాలువలో కలుస్తున్నాయి. గురువారం సాయంత్రం ఎవరో ఆసుపత్రిలో వాడిన ఈ వ్యర్థలను స్థానిక రైలు గేటు ఎదురుగా ఉన్న గోదావరి కాలువలో పడవేశారు. దానితో గోదావరి కాలువలోని జలాలు మరింతగా కాలుష్యానికి గురవుతున్నాయి.

–త్రాగునీటి ఆధారం ఇదే :

కాకినాడ జిల్లాలోని ప్రధాన పట్టణాలైన కాకినాడ, సామర్లకోట, పెద్దాపురం పట్టణాల ప్రజలకు త్రాగునీరు అందించేందుకు ప్రధాన వనరుగా, పశువులకు, పక్షులకు కూడా త్రాగునీరుగా ఈ గోదావరి జలాలే ఉన్నాయి. ఇప్పటికే ద్వారపూడి కెనాల్ రోడ్డును ఆనుకుని ఉన్న పలు గ్రామాలకు చెందిన పరిశ్రమల నుంచి వ్యర్థ జలాలు యాథేచ్ఛగా ఈ గోదావరి కాలువలోనే కలుస్తూ స్వచ్ఛమైన జలాలు కలుషితమవుతున్నాయి. దీనితోనే ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళనకు లోనవుతుండగా ప్రస్తుతం మెడికల్ వ్యర్ధాలు ఈ జాబితాలోకి వచ్చి చేరుతున్నాయి. వాస్తవానికి మెడికల్ వ్యర్థాలను ఆసుపత్రుల యాజమాన్యాలు గొయ్యితవ్వి పాతిపెట్టాల్సి ఉంది. అలాగాక ఇలా విచక్షణా రహితంగా మెడికల్ వ్యర్దాలు గోదావరి కాలువలో వేయడం బాధాకరం. గోదావరి జలాల్లో కలిసిన ఈ వ్యర్దాలు ఒకేచోట ఉండకుండా జలాల ప్రవాహతాకిడికి ఆ ప్రక్కకు, ఈ ప్రక్కకు చేదిరిపోయే అవకాశం ఉంది. కాగా ఈ గోదావరి కాలువలో భక్తులు పవిత్ర స్నానాలను ఆచరించడం, పశువులు జలాలు త్రాగేందుకు కాలువలోనికి దిగడం, ఎవరైనా గోదావరిలో ప్రమాదవశాత్తు గల్లంతు అయితే వారిని గాలించేందుకు గజ ఈతగాళ్లు గోదావరి కాలువలోకి దిగడం జరుగుతూ వస్తుంది. ఈ పరిస్థితుల్లో ఇలా మెడికల్ వ్యర్దాలు అయిన వాడిన సిరంజీలు పడవేస్తే గోదావరి జలాలు తీవ్ర స్థితిలో కలుషితం అవడంతో పాటు కాలువలో దిగిన భక్తులు, ప్రజలు, పశువులకు హాని కలిగే అవకాశం ఉంది. కాబట్టి అధికారులు తక్షణం స్పందించి మెడికల్ వ్యర్దాలు వేసిన వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా గోదావరి కాలువలో ఏ వ్యర్ధాలు కలవకుండా చూడాలని రైతులు, భక్తులు, ప్రజలు కోరుతున్నారు.

# సంతచెరువు పార్క్ సమస్యల పరిష్కారానికి చర్యలు

**– కమీషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ నగరంలోని సంతచెరువు పార్కులో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని నగర పాలక సంస్థ కమీషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. గురువారం ఉదయం ఆయన సంతచెరువు పార్కును సందర్శించి అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కుకు చెందిన వాకర్స్ సభ్యులు కమీషనర్‌కు స్వాగతం పలికి, పార్కులో ఉన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాకర్స్ సంఘం నాయకులు డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పార్కులో పలు మౌలిక సదుపాయాల లోపాలు ఉన్నాయని, వాటిని తక్షణం పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. శాశ్వత పరిష్కారం కోసం కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వాకర్స్ తరఫున కమీషనర్‌ను కోరారు.

వాకర్స్ సూచనలను ఆలకించిన కమీషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ, పార్కులో గుర్తించిన సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పార్కు అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని పేర్కొంటూ, పార్కులో ఉన్న చెట్లకు వాకర్స్ కలిసి వైట్ పేయింట్ వేస్తే మరింత అందంగా కనిపిస్తాయని సూచించారు. నగరంలోని ఇతర పార్కుల్లో కూడా ఇదే విధంగా చెట్లకు వైట్ పేయింట్ వేయడంతో పార్కులు సుందరంగా మారినట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రతి నెల రెండు ఆదివారాల్లో పార్కుల్లో "హ్యాపీ సండే" కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, సంతచెరువు పార్కులో కూడా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామని కమీషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఆరోగ్య అవగాహన, వినోదం మరియు సామాజిక ఐక్యత పెంపొందించడమే లక్ష్యమని చెప్పారు.

కమీషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీచరణ్, ఇంజనీర్ ఆదినారాయణ, శానిటేషన్ సూపర్వైజర్ రాంబాబు, కూటమి నాయకులు చింతలపూడి రవి, బలరాం, చెక్క రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా లక్ష్మీ వెంకటేశ్వర స్వామి చక్రస్నానం





**– ఏకాంత సేవతో ముగిసిన బ్రహ్మోత్సవాలు**

**– పాల్గొన్న జిల్లా వైసీపీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి**

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం చక్రస్నాన కార్యక్రమం ఘనంగా జరిగింది. సాయంత్రం ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగిసాయి. పండితులు ఖండవల్లి సూర్యనారాయణ ఆచార్యులు, సుదర్శనం సూర్యపురుషోత్తం సత్యసాయి, అర్చకులు పవన్ దీక్షితులు, పెద్దింటి కుమారులు ఆధ్వర్యంలో పూర్ణహుతి, చక్ర స్నానం, మహాదాశీర్వచనంతో పాటు రాత్రి స్వామివారి ఏకాంత సేవతో పరిసమాప్తి అయ్యాయి. స్వామివారి పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపించారు. ఉదయం సంకల్పం, విశ్వక్షాన పూజ, పుణ్యావాసనం, మహా శాంతి హోమం, పూర్ణాహుతి ఘనంగా జరిగాయి. అనంతరం శ్రీవారి చక్రస్నానం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, సన్నాయి మేళాలు వాయిద్యాలతో నది తీరంలో ఆలయ శాశ్వత ధర్మకర్తలు చైర్మన్ పాతపాటి వెంకట సత్యనారాయణ రాజు, రాజ్యలక్ష్మి దంపతులుతోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని నది తీరంలో అత్యంత వైభవంగా నిర్వహించారు.

ఈ బ్రహ్మోత్సవాలలో జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చర్ల జగ్గిరెడ్డి, మాజీ డిసిసిపి డైరెక్టర్ చిలుకూరి రామకృష్ణంరాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని కనులారా వీక్షించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ మేనేజర్ గోరింట వినయ్ కుమార్ రాజు పర్యవేక్షించారు.

# సి ఆర్ సి, ఐ ఆర్, ఇతర సమస్యలను పరిష్కరించండి : ఏపీటీఎఫ్




**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** విద్యారంగ, ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద జంగారెడ్డిగూడెం జోన్ పక్షాన ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి రెడ్డి దొర మాట్లాడుతూ 2023 జూలై నుండి 12వ పిఆర్సి అమలు కావలసి ఉండగా, నేటికీ పి ఆర్ సి కమిషన్ ఏర్పాటు చేయకపోవడం శోచనీయమని విమర్శించారు. తక్షణమే పిఆర్సి ని ఏర్పాటు చేసి 30శాతం ఐ ఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ దొర బాబు, జిల్లా కార్యదర్శులు యు వి నరసింహ రాజు, పివిఆర్ రాజ్యలక్ష్మి, జంగారెడ్డిగూడెం మండల శాఖ అధ్యక్షులు ఐవీ రత్నం, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి జగదీష్ తదితరులు ప్రసంగించారు. ఈ ధర్నాలో జిల్లా కౌన్సిలర్ కే సతీష్,జంగారెడ్డి గూడెం,కొయ్యల గూడెం,పోలవరం, బుట్టాయిగూడెం మండలాల శాఖల అధ్యక్ష, కార్యదర్శులు, సీనియర్ నాయకులు కే నాగేశ్వరరావు, ఉమర్ ఆలీషా తదితరులు పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్యం పై అవగాహన



**ఉండి, మేజర్ న్యూస్:** ప్రతి ఒక్కరు మానసిక ఒత్తిడికి గురికాకుండా దురాలవాట్లకు దూరం గా ఉండేందుకు అవ గాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మానసిక ఆరోగ్య క్లినికల్ సైకాలజిస్ట్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆరోగ్యం పైన మానసిక ఆరోగ్యం పైన విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు ప్రతి చిన్న విషయానికి ఒత్తిడికి గురి కాకుండా దురాలవాట్లను విడిచి పెట్టేవారు ఎవరైనా ఉంటే జిల్లా ఆసుపత్రి తణుకు 15వ నెంబర్ ఓపికి వస్తే కౌన్సిలింగ్ ఇచ్చి ఉచితంగా మందులు అందజేస్తామని అన్నారు. మానసిక సమస్యలైనటు వంటివి అతిగా మాట్లాడడం, తనలో తాను నవ్వుకోవడం మాట్లాడు కోవడం ,అనుమానాలు, విపరీత ప్రవర్తనలకు చికిత్స నిద్రలేమి , అతినిద్ర, మతిమరుపు, మైగ్రేన్ వంటి తలనొప్పి సమస్యలకు కౌన్సిలింగ్ ఇవ్వబడుతుందన్నారు. సైకియాట్రిక్ సోషల్ వర్కర్ సుమన్ బాబు మాట్లాడుతూ మనసుకు వైద్యం కోసం దూర ప్రాంతాల వారు 11416 అనే టోల్ ఫ్రీ నెంబర్ కి కాల్ చేయడం ద్వారా వారికి సంబంధిత విషయాలను తెలియపరుస్తారని తెలియజేశారుఈ కార్యక్రమంలో ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్.పి.ఎల్.సునంద సిహెచ్ఓ కృష్ణ కుమార్ పాఠశాల ప్రధానో పాధ్యారాలు ,పాఠశాల సిబ్బంది ఆసుపత్రి సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సిఎస్.టి.ఎస్ కళాశాలలో రక్తదాన శిబిరం

**జంగారెడ్డిగూడెం, మేజర్ న్యూస్:** స్థా నిక సి.ఎస్.టి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళా శాలలో గురువారం ప్రిన్సిపల్ ప్రసాద్ బాబు అధ్యక్షతన రెడ్ రిబ్బన్ క్లబ్, రెడ్ క్రాస్ ఎన్.ఎస్. ఏస్ విభాగాల ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ ఏలూరు వారిచే రక్తదాన శిబిరం జరిగింది. ప్రిన్సిపల్ ప్రసాద్ బాబు రెడ్ రిబ్బన్ విభాగ సమన్వయ కర్త హనుమంతరావు,కో –ఆర్డినేటర్ గాళ్ళ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ డైరెక్టర్ ఎం వినయ్ మాట్లాడుతూ రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలను విశిష్టతను వివరించారు. 24 మంది విద్యార్థులు ఈ రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి శ్రీనివాసరావు, జి.వెంకట లాల్,మధు తదితరులు పాల్గొన్నారు.

# సంతాన సాఫల్య ప్రయాణంలో 'ఒయాసిస్' భరోసా

**- కాకినాడలో కాబోయే తల్లిదండ్రులకు ఘనంగా సీమంతం వేడుక**
**- అత్యాధునిక వైద్య విధానాలతో నెరవేరుతున్న దంపతుల కలలు**



**కాకినాడ, సూర్య ప్రతినిధి :** సంతానలేమి సమస్యలను అధిగమించి, తల్లిదండ్రులు కావాలనే కలను నిజం చేసుకుంటున్న దంపతుల గౌరవార్థం కాకినాడలోని ఒయాసిస్ సంతాన సాఫల్య కేంద్రం ఘనంగా సీమంతం వేడుకను నిర్వహించింది. 16 ఏళ్ల సుదీర్ఘ విశ్వసనీయతతో దేశంలోనే అగ్రగామి సంస్థగా నిలిచిన ఒయాసిస్, కాబోయే తల్లుల ధైర్యాన్ని, ఆశను అభినందిస్తూ ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది.

అత్యాధునిక చికిత్సలకు నిలయం:

కాకినాడ కేంద్రం ప్రారంభమైనప్పటి నుండి ఐ.యు.ఐ, ఐ.వి.ఎఫ్ వంటి సాధారణ చికిత్సలతో పాటు అత్యంత క్లిష్టమైన, ఆధునిక పద్ధతుల ద్వారా ఎందరో దంపతులకు సంతాన భాగ్యాన్ని ప్రసాదించింది. ముఖ్యంగా అత్యాధునిక బీజకణాల ఎంపిక పద్ధతులు, అండం మరియు వీర్యకణాల భద్రపరచడం (క్రయోప్రిజర్వేషన్) వంటి సేవల్లో ఈ కేంద్రం ప్రత్యేక గుర్తింపు పొందింది.

విలేకరుల సమావేశంలో ప్రముఖుల వెల్లడి:

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఒయాసిస్ సంతాన సాఫల్య కేంద్రం సహ వ్యవస్థాపకులు మరియు వైద్య విభాగం డైరెక్టర్ డాక్టర్ దుర్గా జి.రావు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి పుష్కరాజ్ షెనాయ్, మరియు కాకినాడ కేంద్రం సంతాన సాఫల్య నిపుణులు డాక్టర్ రామినీడి దీప్తి ప్రియదర్శని ప్రసంగించారు. ఒయాసిస్ కేంద్రంలో సాధించే ప్రతి విజయం నమ్మకానికి, ఆశకు ప్రతీక అని వారు పేర్కొన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కొత్త ఆరంభాలను జరుపుకోవడానికే ఈ వేడుకను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాస్త్ర విజ్ఞానం మరియు మానవీయ విలువలు కలిస్తే అద్భుతాలు జరుగుతాయని, సంతానలేమి సమస్యలను ధైర్యంగా అధిగమించిన జంటల ముఖాల్లో కనిపిస్తున్న ఆనందమే తమకు లభించిన అతిపెద్ద బహుమతి అని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని ఆధునిక పరిశోధనలతో, రోగుల సంక్షేమమే ధ్యేయంగా సేవలను విస్తరించనున్నట్లు వారు వెల్లడించారు.

విశ్వసనీయతకు మారుపేరు:2009లో స్థాపించబడిన ఒయాసిస్ సంతాన సాఫల్య కేంద్రం ప్రస్తుతం దేశవ్యాప్తంగా 34 కేంద్రాలతో సేవలు అందిస్తోంది. నైతిక వైద్య పద్ధతులు, అత్యున్నత విజయశాతంతో అనేక కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. పురుషులు మరియు మహిళల కోసం ప్రత్యేక చికిత్సలు అందిస్తూ పునరుత్పత్తి ఆరోగ్య సంరక్షణ రంగంలో తన ప్రభావాన్ని పెంచుకుంటూ పోతోంది.

# ఆలయ పరిసరాల్లో 'పెద్దపులి' సంచారం వాస్తవం కాదు!

**- ఫేక్ న్యూస్ వైరల్‌పై భక్తులు మండిపాటు**




**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో పెద్దపులి సంచారంపై ఫేక్ వార్తలు సామాజిక మాధ్య మాలలో వైరల్ కావడంపై భక్తులు మండిపడుతున్నారు. ఈ విధంగా అబద్ధపు ప్రచారం చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు కు చెందిన శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయం గోవిందగిరి ఐ.పోలవరం ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు, అది శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం సమీపానికి వచ్చిందని కొందరు తెలియని వ్యక్తులు ఏఐ సాంకేతికత ద్వారా తయారు చేసిన ఫోటోలను సామాజిక మాధ్యమాలు ద్వారా వివిధ వాట్సాప్ గ్రూపులలో ప్రచారం చేస్తున్నారని ఆలయ అధికారుల దృష్టికి వచ్చింది. ఈ విషయంపై ఆలయ అధికారులు, ఆలయ విజిలెన్స్ విభాగం వారు సమగ్రంగా పరిశీలించారు. ఆలయం పరిసర ప్రాంతాలలో ఎటువంటి పులి కదలికలు గానీ, ప్రమాదకర పరిస్థితులు గానీ లేవని స్పష్టంగా నిర్ధారించారు. ప్రస్తుతం ఆలయం వద్ద భక్తుల భద్రతకు ఎలాంటి ముప్పు లేదన్నారు. అయినప్పటికీ, ప్రజల్లో అనవసరమైన భయాందోళనలు తలెత్తకుండా పూర్తిస్థాయి జాగ్రత్త చర్యలలో భాగంగా తిరుపతి నుండి ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు పగలు, రాత్రి వేళల్లో ఆలయ పరిసర ప్రాంతాలలో విజిలెన్స్ సిబ్బంది నిరంతరం రౌండ్స్ నిర్వహిస్తూ పరిస్థితిని పర్యవేక్షించమని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ప్రజలు, భక్తులు ఎవరూ నిర్ధారణ లేని వార్తలు, ఫోటోలు, వీడియోలను నమ్మవద్దని, అలాగే అలాంటి సమాచారాన్ని షేర్ చేయవద్దని విజ్ఞప్తి చేసారు. అధికారిక సమాచారం కోసం మాత్రమే ఆలయ అధికారుల ప్రకటనలను విశ్వసించాలని కోరారు. మీడియా ద్వారా భక్తులందరికీ ఆలయం వద్ద పూర్తి భద్రత ఉందని ఆలయ అధికారులు శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయం గోవిందగిరి, రంపచోడవరం తరపున తితిదే గోవిందగిరి శ్రీవారి సేవ బృందం కో-ఆర్డినేటర్ నల్లమిల్లి వేంకటరామారెడ్డి పేర్కొన్నారు.

# ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో
# ఘనంగా 'సైన్స్ ఒడిస్సీ' వేడుకలు



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** స్థానిక సాంబమూర్తి నగర్‌లో ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో బ్యాచ్‌లర్ ఆఫ్ జీవ మరియు రసాయన శాస్త్ర విభాగం వారు సైన్స్ ఒడిస్సిని ఘనంగా నిర్వహించారని కళాశాల ప్రిన్సిపల్ కె.కరుణ తెలియజేశారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆదిత్య డిగ్రీ మరియు పి.జి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.వి.ఎల్ నాయుడు మాట్లాడుతూ "స్వదేశీ టెక్నాలజీ ఫర్ వికసిత్ భారత్" భారత దేశ సమగ్ర అభివృద్ధిలో సైన్స్ ప్రాముఖ్యతను గుర్తించడంతో పాటు దేశీయంగా వివిధ వర్గాల విద్యార్థులు తమ దైనందిన జీవితంలో ఉపయోగపడేలా సైన్స్ మరియు సైంటిఫిక్ రీసెర్చ్ ను ప్రోత్సహించాలని అలాగే మానవ సంక్షేమంలో శాస్త్రవేత్తల కృషిని కూడా గుర్తించాలని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా సైన్స్ & టెక్నాలజీ అభివృద్ధి చెందిన విధానాన్ని అర్ధంచేసుకోవడం, అలాగే ఈ రంగంలో మరింత కృషి చేయాలసిన అంశాలను అన్వేషించి ఆ దిశగా అడుగులు వేయాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆదిత్య మహిళా కళాశాల ప్రిన్సిపల్ కె.కరుణ మాట్లాడుతూ జీవ మరియు రసాయనశాస్త్ర విభాగం విద్యార్థినులు ప్రాజెక్ట్స్, క్విజ్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ మరియు పోస్టర్ ప్రెజెంటేషన్‌లో తమదైన ప్రతిభ కనపరిచారని విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థినులు పాల్గొని ప్రతిభను కనపరిచారని అన్నారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథి డా॥ కె.శ్యామల విద్యార్థి, విద్యార్థినీలను ఉద్దేశిస్తూ ఇప్పుడు ఉన్న సాంకేతికను ఉపయోగించుకుంటూ పరిశోధన రంగంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా బహుమతులు సాధించిన విద్యార్థినీ,విద్యార్థినులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగశ్రీకాంత్, జీవ మరియు రసాయన శాస్త్ర విభాగ అధిపతులు కె.నవ్య మరియు యు.నాగవల్లి, అధ్యాపక బృందం ఎ.సాయి ఝాన్సీ, ఎస్.ఎస్. భువనేశ్వరీ దేవి, కె.గంగా భవాని, ఎస్.కె. సలీమా, వి.పద్మినీ, తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

## వెంకన్న హుండీ ఆదాయం
# రూ.2 కోట్ల 17 లక్షలు



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 35 రోజులు కాలానికి రూ.2 కోట్ల 17 లక్షల 83 వేల 358 లు; బంగారం 42 గ్రాముల 48 మిల్లీ గ్రాములు; వెండి 1కేజీ 280 గ్రాములు; పలు విదేశీ కరెన్సీ నోట్లు సమకూరింది. ఈ లెక్కింపు కార్యక్రమంలో చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, ఆలయ కమిటీ సభ్యులు, తనిఖీ అధికారి తదితరులు ఉన్నారు.

## పరిపాలనాపరమైన ఉత్తర్వులు జారీ



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** జేఎన్టీ యూకే పరిధిలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాకి నాడ (యూసీఈకే)కు సంబం ధించి ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కే. ప్రసాద్పరిపాలనాపరమైన ఉత్తర్వులు జారీ చేశారు. ఉపకులపతి ప్రొఫె సర్ సి.ఎస్.ఆర్.కే. ప్రసాద్ ఆదేశాల మేరకు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ కె.పద్మరాజుని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాకినాడ (యూసీఈకే) ప్రిన్సిపాల్‌గా నియమిం చారు. అదేవిధంగా, ఇప్పటి వరకు యూసీఈకే ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.మోహన్ రావుని ప్రిన్సిపాల్ బాధ్యతల నుండి రిలీవ్ చేశారు.ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ, విశ్వవిద్యాలయ అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, పరిపాలనా సమర్థత సాధనలో కొత్త ప్రిన్సిపాల్ సమర్థ ంగా బాధ్యతలు నిర్వహిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, ప్రొఫెసర్ ఎన్.మోహన్‌రావు ప్రిన్సిపాల్‌గా ఉన్న సమయంలో చేసిన సేవలను అభినందించారు.

## పేద ముస్లిం కుటుంబాలకు
## రంజాన్ జకాత్ కిట్లను అందజేసిన జమాల్ ఖాన్



**చింతూరు,మేజర్‌న్యూస్:** చింతూరు మండల కేంద్రంలో గురువారం పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకెసి ట్రస్ట్ చైర్మన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ గురువారం పేద ముస్లిం కుటుంబాలకు జకాత్ కిట్లను అందజేశారు. 10 కేజీల బియ్యం, 1 కేజీ పంచదార, 1 కేజీ కందిపప్పు, 1 కేజీ గోధుమపిండి, 1 లీటర్ మంచి నూనె, సేమియా 1 కేజీ, కారం100 గ్రాములు, పసుపు 100 గ్రాములు, ఉప్పు1. కేజీ మొత్తం తొమ్మిది రకాల నిత్యావసర వస్తువులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ధనం కలిగిన ప్రతి ఒక్కరు విధిగా తమ సంపద నుండి నూటికి రెండు రూపాయల 50 పైసలు తీసి పేదలకు జకాత్ రూపేనా అందజేయాలన్నారు. తాను సంపాదించిన సంపద ధర్మబద్ధంగా ఉండాలంటే జకాతును తప్పనిసరిగా సంపద కలిగిన ప్రతి ఒక్కరూ పాటించాలని అల్లా కురాన్‌లో ఆదేశించడం జరిగిందన్నారు. రోజా ఉపవాసాలు విధిగా ప్రతి ఒక్కరూ పాటించాలని పేదల ఆకలి దప్పులు తెలిసే విధంగా ఉపవాసాలు మనిషికి జ్ఞానాన్ని ప్రసాదిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ తెలుగుదేశం నాయకులు మహమ్మద్ జహంగీర్, మల్లెల్లి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ సోడె శ్రీనివాసరావు, మస్జిద్ ఇమామ్ అబ్దుల్‌వహీద్,వహీదుల్లాఖాన్,బాబుభాయ్,అఖిల్,ఎస్. కే. రియాజ్, అజీజ్, సత్యనారాయణ, నటరాజ్ పాల్గొన్నారు.